# ప్రయోజనం

ఆ ఫ్రేము నిలబెడితే ఆరేళ్ళ కుర్రాడంత ఎత్తుగా ఉంది. దాంట్లో మధ్యన అందమైన అక్షరాలు మెరుస్తున్నాయి. కమనీయమైన గానానికి మధురమైన భాష తోడైనట్లు ఆ సన్మాన పత్రంలోని అక్షరాలకి చుట్టూ తళతళ మెరిసే బిళ్ళలు అమర్చి వున్నాయి. అత్యంత రమణీయంగా, కళాత్మకంగా చెక్కిన లతలమధ్య మురారి పేరు ఎంతో ముచ్చటగా వుంది. సరస్వతి తదేకంగా దాని వంకే చూసి చూసి చివరికి

"చాలా బాగుందండీ" అంది సంతృప్తిగా.

"అవును. వాళ్ళెంతో కష్టపడి, శ్రమపడి తయారుచేసి యిచ్చారు. నేనైతే మోసుకురాలేనని వాళ్ళే మనిషినిచ్చి ఇంటికి పంపారు" అన్నాడు షర్టు గుండీలు విప్పుకుంటూ మురారి.

"కవిగారికి ఆ మాత్రం మర్యాద, ఆదరణ వుండాలి సుమండీ" అంది నవ్వుతూ.

ఆమెకళ్ళల్లో కనిపించిన మెప్పుకీ, గర్వానికీ అతను పరవశుడయ్యాడు. తన్నింతగా ప్రేమించి తనకోసం అందరినీ వదులుకొని వచ్చేసిన సరస్వతికి తనేం యివ్వగలడు? అనే ప్రశ్న ఉదయించి మనస్సు కలుక్కుమంది.

"నీకు నేనంటే యింత యిష్టం కదా! నీకు నేనేమివ్వగలను!" అన్నాడు మనసులో దాచుకోలేక.

"ఇంకా ఇచ్చేదేమిటి? అంతా ఎప్పుడో యిచ్చేసి" అంటూ ఆమె నవ్వింది. తెల్లగా వున్న ఆమె బుగ్గలు ఒక్కసారి ఎరుపెక్కాయి.

"అవునుగాని ఇందాక మీ కోసం పద్మావతి వచ్చింది. ఆమె తెలుగు ఎమ్.ఎ.కి మీరు పాఠం చెప్పటానికి వీలుండదన్నారుటగా, మళ్ళీ ఓసారి అడుగుదామని వచ్చిందట."

"ఏమన్నావు?"

"నేనేమంటాను? మీరు లేరని, మీటింగుకు వెళ్ళారని చెప్పాను"

"నాకెక్కడ టైముంది సరూ; స్కూల్లో కొట్టుకుని కొట్టుకుని వస్తే.... మళ్ళీ పాఠాలంటే–" ఆగాడు.

"డబ్బు యిస్తుందట" అంది సరస్వతి. ఆమె మాటలో ధ్వనించిన ఆశకి అతను నవ్వుకున్నాడు.

"కావచ్చు. అయినా నేనేదైనా రాసుకుందామంటే టైములేకుండా పోతుంది". అన్నాడు నెమ్మదిగా. సరస్వతి మాట్లాడలేదు. అతను కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చాడు. ఆమె అన్నం వడ్డించింది.

❖ ❖ ❖

హడావుడిగా వచ్చిన ప్రసాదరావుని ఆదరంగా ఆహ్వానించాడు మురారి. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. చదువురాక ప్రసాదరావు బిజినెస్‌లోకి దిగిపోయాడు. చదువుకునే శక్తి లేక, డబ్బు ఖర్చులేని చదువు కోసం భాషా ప్రవీణలో చేరాడు మురారి. పెట్టుబడి పెట్టగల ప్రసాదరావు వ్యాపారంలో బాగా రాణించాడు. డబ్బు గడించాడు. జన్మతః సరస్వతీ కటాక్షం గల మురారి మంచి కవిగా పేరు తెచ్చుకున్నా, బ్రతుకు తెరువుకి కావలసినంత డబ్బు మాత్రం సంపాదించలేకపోయాడు.

ప్రసాదరావుకి మురారి అంటే అభిమానం. పెద్దవాళ్ళెవరైనా అతని గురించి ఏదైనా మాట్లాడితే "వాడు మావాడే"నని చెప్పుకోవడం అతనికెంతో గర్వంగా ఉంటుంది. మురారి యింటికి వచ్చి ఎంతో కలివిడిగా వుంటాడు ప్రసాదరావు.

"ఒరే మురారీ, నేనెలాగూ వ్యాపారినే కదా, నువ్వో నవల వ్రాయి, దాన్ని అచ్చువేసి నేను అమ్ముతాను. నీకు కొంత యిస్తాను" అన్నాడు. మురారి నవ్వి వూరుకున్నాడు. ప్రసాదరావు అంతటితో ఆగక "నువ్వేదో పద్యాలు, భావ కవిత్వాలు అంటూ వ్రాసుకుపోతే అవి ఎవరిక్కావాలి? దేనికైనా ప్రయోజనముండాలి. రాబడి వుండాలి. అప్పుడే దానికి విలువ. కూడూ, గుడ్డా పెట్టని కవిత్వాలెందుకురా" అన్నాడు.

ఆ మాటలన్నీ విని కూడా మురారి ఒక చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"చిరునవ్వులు చిందించడం కాదు. సమాధానం కావాలి నాకు" అన్నాడు ఛాలెంజ్ విసురుతూ.

"నా కవిత్వం వ్యక్తి ప్రయోజనం కోసం కాదు. సామాజిక ప్రయోజనం కోసం. డబ్బుతో దానికి ఖరీదు ఏర్పరచలేను. ఇది నా సిద్ధాంతం" మురారి గంభీరంగా చెప్పిన మాటలు విని ప్రసాదరావు గతుక్కుమన్నాడు. అయినా వూరుకోలేదు. అతని వాదాన్ని తీసి పారేస్తూ -

"నువ్వీ జన్మలో బాగుపడవు. వ్యక్తి లేకుండా సమాజం ఎక్కడి నుంచి వచ్చింది? మనిషి అదుక్కుతిని సమాజానికి, సంఘానికి చెయ్యగలిగిందేమీ వుండదు. ముందు నీ గురించి నువ్వు ఆలోచించుకో. నాలుగు డబ్బులొచ్చే సాహిత్యం సంగతి చూడు" అన్నాడు.

స్నేహితుడి మాటలకి మురారి గంభీరంగా అయిపోయాడు.

"ఏదో ఒకటి వ్రాసి, దాన్ని సొమ్ము చేసుకోవడం సాహిత్యం పట్ల అపచారం చెయ్యడం అని నా అభిప్రాయం. అందుకే నాకిష్టంలేదు. నా మనస్సులో కవిత్వపు అలలు కదులుతాయి. కాని కథలకి, నవలకి కావలసిన సన్నివేశాలు, పాత్రలు కదలవు. వాటి కోసం నేను శ్రమపడి యత్నించను" అని సమాధానమిచ్చిన మురారి భుజం మీద తట్టి, "శభాష్. మంచి ఆదర్శవాదివి" అంటూ వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

❖ ❖ ❖

ఆనాటి నుంచి ప్రసాదరావు మాటలు మురారి మనసులో మారు మోగుతూనే వున్నాయి. ఏమిటి ప్రయోజనం? తన సాహిత్యానికి, రచనకి ఏమిటి విలువ? అసలు దీనికెవరైనా సరైన సమాధానం చెప్పగలరా? ఏ యుద్ధానికి, ఏ విప్లవానికి, ఏ సంస్కరణకి, ఏ సాహిత్యం మాత్రం ఏం చేయగలిగింది? చెప్పడమే సాహిత్యంలో కనిపిస్తుంది. ఆచరణ దగ్గరకొస్తే - కొంతవరకే.

"ఏమండీ, మన పక్కింటివారబ్బాయి తెలుగు గ్రామరు అర్థంకాక అవస్థ పడుతున్నాడుట. కాస్త చెప్పండీ, కాదనకండి. వాళ్ళమ్మగారు ఎంతో మంచిది" అంది సరస్వతి అభ్యర్థనగా.

మురారి విసుగ్గా భార్య ముఖంలోకి చూచాడు. కాని పెదవి విప్పి ఏమీ అనలేక వూరుకున్నాడు. ఆమె అతని దగ్గరగా వచ్చి గుసగుసలాడుతున్నట్లు "మొన్న బాబుకి విపరీతంగా జ్వరం వచ్చి, మీరు లేక నేనెంతో కంగారు పడుతుంటే ఆమె డాక్టరు దగ్గరకి వెళ్ళడానికి పది రూపాయలిచ్చి ధైర్యం చెప్పి, తోడు కూడా వచ్చింది" అంది.

మురారి మనసులో కుంచించుకుపోయాడు. రెండు నెలలుగా జీతాలు రాని మాష్టారు ఉద్యోగం చేస్తున్న తను ఎంతమంది సానుభూతికి, దయకి పాత్రుడు కావలసి వుందో అని మథనపడ్డాడు. ప్రయివేటు స్కూల్లో టీచరంటే యిచ్చినప్పుడే జీతం తీసుకోవడానికి సిద్ధంగా వుండాలి. అది అతనికి అనుభవం ద్వారా తెలిసిన మొదటి విషయం.

కుర్రాడికి ఎంత చెప్పినా ఒక్క ముక్క అర్థం కావడం లేదు. చురుకైన బుర్ర కాదు. చెప్పిందే చెప్పి విసిగిపోయి మురారి నిరాశ చెందాడు.

ఉన్నట్టుండి ఆ కుర్రాడు గోడకి ఏటవాలుగా వేలాడుతున్న సన్మాన పత్రాన్ని చూసి "అదేవిటండీ?" అన్నాడు.

మురారికి వెంటనే ఎలా చెప్పాలో తెలీలేదు. నెమ్మదిగా ఆలోచించి అతని కర్థమయ్యేలా చెప్పాడు. వెంటనే "దానివల్ల లాభమేమిటండీ" అంటూ అమాయకంగా చూశాడు ఆ కుర్రాడు.

మురారి బిత్తరపోయాడు. నిజంగా ఈ ప్రశ్నకి అతని దగ్గరగా సమాధానం లేదు.

"లాభం, ఉపయోగం అంటే ఏముంది? అదొక గౌరవం అంతే!" అంటూ దాటేశాడు. అర్థం కాకపోయినా మాష్టార్ని యింకా అలాంటి ప్రశ్నలు వేస్తే బాగుండదని వూరుకున్నాడు వాడు.

మురారి మనసు వికలమైంది. ఆర్థికపరమైన యిబ్బందులు అతన్ని ఎంతో అశాంతికి గురిచేస్తున్నాయి. తను కవిత్వం వ్రాసి తనేం చెయ్యగలుగుతున్నాడు? సరస్వతికి ఏమివ్వగలుగుతున్నాడు? భార్యకి, కొడుక్కి కడుపునిండా తిండి పెట్టలేకపోతున్నాడు. దీనివల్ల ప్రయోజనం ఏమిటి? అదెలా సాధించాలి? అనే ప్రశ్నలు అతని బుర్రని దొలిచెయ్యడం మొదలుపెట్టాయి.

❖ ❖ ❖

తెల్లవారింది. దూకుడుగా సూర్యుడు దూసుకొచ్చేశాడు. మురారికి రాత్రంతా నిద్రలేదు. గాలి పోని గుడారంలాంటి గది నిండా దోమలు. అన్నిటికీ మించిన ఆలోచనల అశాంతి అతన్ని నిద్రకి దూరం చేసింది. సరస్వతి అప్పుడే లేచింది. ఆ రోజు వాడుకలో పాలు పోసే మనిషి పాలు పొయ్యలేదు. అరువు తెచ్చుకున్న సరుకులన్నీ అయిపోయాయి. ఏమైనా కొందామంటే చేతిలో పైసా లేదు. తన గేయాల కట్టను

నెత్తిన పెట్టుకుని తనిప్పుడే ఆస్థానం వైపు నడవాలి? అని వూహించి విషాదంగా నవ్వుకున్నాడు.

తనలో దేనిని చూసి సరస్వతి తనని ప్రేమించిందో దానివల్ల ఆమెనేమీ సుఖపెట్టలేకపోతున్నాడు. తనింత చేతకాని వాడని ఆమె ముందే గ్రహించి వుంటే, ఈరోజిలా బాధపడాల్సిన పని వుండేది కాదేమో!

నిష్ప్రయోజనమైన కవిత్వాన్ని వ్రాసి వ్రాసి తను అమూల్యమైన సమయాన్ని వృథా చేశాడు. నిజం! ఈ కవిత్వానికీ, ఈ సన్మానాలకీ, ఈ పూలదండలకీ, ఈ ఊకదంపుడు ఉపన్యాసాలకీ పైసా విలువ లేదు. ముచ్చి బంగారం రేకులు చూసి ముచ్చట పడాల్సిన వాళ్ళు పసిపిల్లలు. తనాస్థితి యింకా దాటలేదన్నమాట. తనలో యింత మూఢత్వం ఎందుకు పేరుకుపోయిందో తనకే తెలీడం లేదు.

సరస్వతి ఎలా సంపాయించిందో ఒక గ్లాసుడు పాలు-కాఫీ కలిపి భర్తకిచ్చింది. అది అందుకుంటుంటే అతనికెంతో అవమానం అనిపించింది.

మురారి పడక్కుర్చీలో వాలి తన సన్మాన పత్రంలోని తళుకు బిళ్ళల్ని తదేకంగా చూస్తున్నాడు. వెలిసిపోయిన నక్షత్రాల్లా అవి మెరవడం మర్చిపోయినట్లున్నాయి. అందులో మాటలు పేలవంగా, హాస్యాస్పదంగా వున్నట్లునిపించిందతనికి. ఇంతటి పొగ మంచుని తనెలా స్వీకరించాడా అని ఆశ్చర్యపోయాడు. అందులో నిజంగా విలువైంది ఏమిటా అని ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఫ్రేము, అందులో బిగించిన పెద్ద అద్దం, దాని వెనుక రేకు, యివన్నీ కలిస్తే ఏ ఏడెనిమిది రూపాయలుండవచ్చు.

నిజానికి అందులోంచి తన సన్మానపత్రం తీసేస్తే దానికి కొంచెమైనా మూల్యం వుండేటట్లు అనిపించింది. వెంటనే అతనిలో ఒక మెరుపులాంటి ఆలోచన మెరిసింది. ఆ పటంలోని సన్మానపత్రం తీసేసి దాన్ని అమ్మేసి తనాపూట గడుపుకోవచ్చనిపించింది. అతను వెంటనే లేచి స్టూలు లాక్కుని అది తీసేద్దామని ఎక్కి మేకులకి చుట్టిన తాడు విప్పబోయాడు.

ఇంతలో దాని వెనుకనుంచి కిచకిచమన్న శబ్దం వినిపించింది. మురారి పటం వెనక్కి తొంగి చూశాడు. అతని గుండె ఒక్కసారి ఆగినంత పనైంది.

శతకోటి సముద్రాలు ఒక్కసారి ఎగిసినట్లనిపించింది. మోడుగచెట్లు విరబూస్తే, ఆడివంతా నవ్వినట్లనిపించింది. ఆకాశంలో వుండే నక్షత్రాలు షికారుగా భూమ్మీదకు

విహారానికి వచ్చినట్లనిపించింది. మలయమారుతం లోకాన్ని గిలిగింతలు పెట్టినట్లని పించింది. తల్లి గుండెలోంచి ప్రేమనీ, చనుబాలనీ త్రాగిన పసిపాప నవ్వినట్లని పించింది.

మురారి కవి హృదయం పొంగింది. ఉప్పొంగింది. అక్కడ గుట్టుగా గూడు కట్టుకుని, గుడ్లు పెట్టుకున్న పిచ్చుకల జంట అతనికేదో సృష్టి అర్థాన్ని వివరించి చెప్పినట్లయింది.

ఇదే – ఇదే కవిత్వానికి నిజమైన ప్రయోజనం. ఒక్కపటం వేలాడని తనింట్లో, తన సన్మానపత్రం పక్షి జంటకి గూడైతే ఇంకా ఇంతకి మించిన ప్రయోజనం దానికేముంటుంది? అని అతని మనసు ప్రశ్నించింది.

మురారి మనసు మబ్బు విడిన ఆకాశంలా మారింది. అతను నెమ్మదిగా కిందకి దిగి కుర్చీలో కూర్చుండిపోయాడు.

●